5.

# మానవుడు సచ్చిదానంద స్వరూపుడు

చైతన్యమని అన్న క్షేత్రజ్ఞుదన్నను
జ్ఞానమన్నను అహముయన్నను
ఈశ్వరుడన్నను ఇల విష్ణువన్నను
బ్రహ్మయన్న ఆదిశక్తియన్న
ఆనందమనియన్న పరమపదంబన్న
ప్రకృతియన్న ఆత్మకు అనేక నామధేయంబులు
బట్టబయలంద్రు ఏ పేరు పెట్టలేదు
ఒక్క ఆత్మకే ఇన్ని నామ రూపములు కలవు

హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుడు సంశయము పనిలేదు
హరిమయము గాని ద్రవ్యము
పరమాణువు లేదు యిలను పరికించినచో.

## భగవంతుని అనుగ్రహమే శాశ్వతానందము

ప్రేమస్వరూపులారా!

ఈ ప్రపంచమంతయు హరిమయము. ప్రతి మానవుడు ఆనందమును కోరుతుంటాడు. ఆనందమయ జీవితమునే ఆశిస్తుంటాడు. ఎన్ని చదువులు చదివినా ఎన్ని, ఎన్ని పదవులు ఏలినా, ఎంత కళాకారుడైనా ఆనందమును ఆశిస్తూనే ఉంటాడు. ఈ జీవితము ఆనందమయము గావించుకోవటానికి తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండు నంతవరకు అనేక ప్రయత్నములు సల్పుతుంటాడు మానవుడు. భారతీయ సంస్కృతిగానీ, సాంప్రదాయము గానీ యీ ఆనందమునే ప్రబోధిస్తూ వచ్చింది. అయితే ప్రతి మానవుని చుట్టూ భౌతికము, ఆధ్యాత్మికము అనే రెండు తెరలు ఉంటాయి. Material out looks,

sri sathyasai vachanamrutam

spiritual out looks. ఈ రెండింటి సమత్వము, ఏకత్వమును మానవుడు గుర్తించుకొనలేక రెండును వేరువేరుగా విభజిస్తున్నాడు. ఈ రెండింటి ఏకత్వమే నిజమైన ఆత్మతత్త్వము. భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన యీ జగత్తునందు పదార్థములే ప్రమాణమని విశ్వసించి యీ పదార్థముల నిమిత్తమై మానవుడు తన జీవితమును అంకితము గావించుకుంటున్నాడు. కానీ దీనియొక్క సత్యనిత్యములు నిదానముగా యోచించి చూచిన యిందులో ఏమాత్రం సత్యం లేదు. అప్పటికప్పటికి మాత్రమే యిది సత్యముగా గోచరిస్తుంది. కానీ యిది శాశ్వతమైన సత్యము కాదు. ఇది శాశ్వత ఆనందము కాదు. ఇట్టి శాశ్వత ఆనందము తాను పొందవలెనన్న తగిన కృషి చేయాలి. జగత్తంతయు సత్ చిత్ ఆనందమయమే. ఈ జగత్తు సచ్చిదానందము. పిపీలకాది బ్రహ్మ పర్యంతము ప్రతి ప్రాణి ఆనందము నిమిత్తమై అర్రులు జాచి కాచుకొని ఉన్నాడు. కేవలం మానవమాత్రుడు మాత్రమే కాదు. పశుపక్షిమృగాదులు కూడా యీ ఆనందమును ఆశిస్తూనే ఉన్నాయి. సర్వప్రాణులకు ప్రధానమైన ప్రాణమే యీ ఆనందము. ఆనందము లేక క్షణమైనా మానవుడు జగత్తులో నిలువజాలడు. ఈ ఆనందము నిమిత్తమై అనేక శాస్త్రములు ప్రబోధిస్తూ వచ్చాయి. వేదశాస్త్ర యితిహాస పురాణములన్నియు సత్ చిత్ ఆనందమే ప్రధానమైన లక్ష్యమని ప్రబోధిస్తూ వచ్చాయి. అనేకమంది జగత్తు ఉన్నది అని విశ్వసిస్తున్నాడు. అయితే అంధునికి ఈ ప్రపంచము ఉందనే సత్యము స్వానుభవములో ఏమాత్రము తెలియదు. అందరు ఉన్నదని బోధించటం చేత, పలకటం చేత తాను కూడా జగత్తు ఉన్నది అని విశ్వసిస్తున్నాడు. ఈనాటి మానవుడు కూడ, ఇతిహాస పురాణములు, పండితులు, వేదశాస్త్రములు, సత్‌చిత్ ఆనందము ఉన్నదని తెలపటంచేత ప్రతి మానవుడు సచ్చిదానందమని ఉచ్చరిస్తున్నాడు. ఇతనికి కూడా స్వానుభవములో ఏమాత్రము సత్యము గోచరించటం లేదు. ఈనాడు ప్రతి మానవుడు మానవత్వం అంటే ఏమిటో గుర్తించుకున్నప్పుడే సచ్చిదానందము ఏమిటో అని తెలుసుకో గల్గుతున్నాడు. ఈ సత్ చిత్ ఆనందము మానవునకు ప్రత్యేకముగా ఉండే పదార్థమని భావిస్తున్నాడు. తనకంటే వేరైనది కాదు యీ సత్ చిత్ ఆనందము. వేరే ఉన్నదని భావించుకోటానికి కారణం ఏమిటి? తనయందు ఈ భౌతికమైన భ్రాంతి అనేకవిధములుగా చేరిఉండటంచేత ఈ

srisathyasaivachanamrutam

సచ్చిదానందము ప్రత్యేకముగా ఉన్నదని విశ్వసిస్తున్నాడు. దేహాభిమానం ఉండినంతవరకు సచ్చిదానందమనేది తనకంటే వేరైనదిగా విశ్వసిస్తూ ఉంటాడు. నేను అంటే ఎవరు అనే సత్యము గుర్తించాలి. "నేను దేహమును" నేను ఆకారమును, నేను మానవుడను, నేను ఒక జీవుడను అనే భావము ఉండినంతవరకు యీ సత్‌చిత్ ఆనందమునకై అనేక ప్రయత్నములు చేస్తుంటాడు మానవుడు. ఈ 'నేను' అనే సత్యము గుర్తించుకున్న మానవుడు సచ్చిదానందము వేరుగా ఉందని విశ్వసించడు. తానే సత్ చిత్ ఆనంద స్వరూపుడు. ప్రతి వ్యక్తి కూడా సత్ చిత్ ఆనంద స్వరూపుడే. సత్ దేవుడు. చిత్ జీవుడు. ఈ రెండింటి ఏకత్వమే ఆనందము.

## ఆరోగ్యంపై మనసు ప్రభావం

ఒక్క విషయము ప్రతి మానవుడు గుర్తించాలి. ఈనాటి మానవుని దేహమునకు అనేక రోగములు సంభవిస్తున్నాయి. ప్రతి మానవుడు దేహమునకు వచ్చిన రోగములనే విశ్వసిస్తున్నాడు. కానీ అన్ని రోగములు దేహమునకు సంబంధించినవి కాదు. ఈ దేహమునకు సంబంధించిన రోగములను ఔషధముల ద్వారా నివారించుకోవచ్చును. కానీ మానసికమువల్ల ఏర్పడిన రోగములే అమితంగా ఉంటునాయి యీనాడు లోకములో. ఈ సంకల్ప వికల్పములు మనస్సునకు చేరి మనసు ద్వారా ఈ శరీరములో ప్రతి అణువు, ప్రతి కణమును రోగమయంగా మారుస్తున్నాయి. మానవుని రోగములకు మూలకారణం మనస్సే. ఈ మనస్సు యీ దేహముచేత కట్టబడినదే. దేహము మనస్సుకు ఒక ఉపాధి. ఈ ఉపాధుల యొక్క సంబంధమంతా నెగిటివ్‌నే. ఈ నెగిటివ్ nature ను అనుసరించినంత వరకు ఏమాత్రం ఆనందము లభ్యము కాదు. మానవుని మనస్సునందు రోగములు మాత్రమే కాదు. కొన్ని రసాయనిక పదార్థములు కూడా ఆవిర్భవిస్తున్నవి. తన దేహములో కొన్ని దుర్గుణములు, దురాలోచనలు, దుర్బోధలు సంభవిస్తున్నాయి. సద్భావములు, సదాచారములు, సచ్చింతనలు ఆవిర్భవిస్తున్నాయి. ఈ సంకల్పములను సత్క్రమమైన సంకల్పములుగా ప్రయాణము చేసుకున్నప్పుడే మానవుడు చక్కని ఆరోగ్యము పొందగలడు. మానవుడు ఎంత ఆలోచనలు జరుపుతుంటారో అన్ని రోగములకు గురౌతుంటాడు. ఈ

sri sathyasai vachanamrutam

సంకల్పవికల్పములే రోగమునకు మూలకారణము. ఇవి అనేక రోగములను మానవునియందు పుట్టిస్తున్నాయి. జీర్ణకోశమును చెడగొడుతున్నాది. గుండె రక్త ప్రసరణము సరియైన మార్గములో పెట్టకుండా పోతున్నాది. Blood pressure తెప్పిస్తున్నాది. డయాబటీసు వస్తున్నాది. Mental worry వలన మానసిక సంబంధమైన వ్యాధులు సంభవిస్తున్నాయి. Lungs యొక్క రోగములు సంభవిస్తున్నాయి. అనగా రోగములకు మూలకారణమైన సంకల్పములే మానవుని ఆనందమునకు అడ్డు తగులుతున్నాయి. ప్రతి మానవుడు నాకు ముక్తి కావాలి అని ఆశిస్తున్నాడు. ఈ ముక్తి ఎవరికి కావాలి. దేహమునకు కావాలా? మనస్సుకు కావాలా? లేక బుద్ధికి కావాలా? లేక ఇంద్రియములకు కావాలా? అని విచారణ చేస్తే వీటికి అన్నింటికి ముక్తి కావాలి.

**శాంతిని పొందటమే ముక్తి**

రోగమునుండి విముక్తి పొందటం విముక్తియే. శాంతి మానవునిలో ప్రవేశించి అశాంతిని విముక్తి గావించటము ముక్తియే. ఆకలిచేత బాధపడుతున్న మానవుడు. అన్నము తిని ఆకలిని విముక్తి గావించుకోటము ముక్తియే. నిత్యజీవితములో ప్రతి కష్టము, ప్రతి బాధను నివారణ గావించేదంతా ముక్తియే. బ్రతికినప్పుడు అనుభవించవలసిన ముక్తులు మొట్టమొదట అనుభవించాలి. ముక్తి మరణించిన తరువాత లభ్యమవుతుంది అనుకోటం చాలా పొరపాటు. ఈనాడు మనము సాధించవలసిన ముక్తులు భౌతికమైనవే. ఇవన్నీ దేహాభిమానము ఉండినంతవరకు తప్పునవి కాదు. మానవుడు యీనాడు అనుభవించే కర్మలు కూడా నెగిటివ్. ఈ నెగిటివ్ ఆలోచనలు అనేవి మానవునిలో ఉండినంతవరకు ఏమాత్రము అతనికి శాంతి లభ్యము కాదు. మనము పొంద వలసిన ముక్తి శాంతియే. శాంతి మనకు లభ్యమైన, సర్వము లభ్యమైనట్లే. భగవంతుడనగా బ్రహ్మయే. బ్రహ్మ అనగా సత్యమే. సత్యమే దైవస్వరూపము. సత్యమార్గములోపల మనము ప్రయాణము చేసినప్పుడే శాంతి లభ్యమవుతుంది. మానవునియందు ఈ నెగిటివ్ thoughts ప్రవేశించటం చేత అనేక రకములైన అశాంతికి గురౌతున్నాడు. హృదయములో నెగిటివ్ thoughts ఉంచుకొని ఎన్ని ప్రార్థనలు చేసినప్పటికి, ఎన్ని సాధనలు సల్పినప్పటికిని, ఎన్ని పూజలు చేసినప్పటికి అన్నీ వ్యర్థమే. అంతఃకరణయే పెద్ద water tank. మనము చేసే సర్వకర్మలు, సర్వేంద్రియములు

taps వంటివి. చూసే నేత్రములు, వినే కర్ణములు, పలికే నాలుక, వాసన చూసే నాశికము, పనులు చేసే చేతులు, నడిచే పాదములు యివన్నీ యీ tank కు సంబంధించినవే. అంతఃకరణయందు ఒకవిధమైన negative thoughts ఉంచుకోటంచేత చేసే కర్మలన్నీ నెగిటివ్‌గా రూపొందుతున్నాయి. మన మనస్సునందు అనేక రసాయన పదార్థములు ఉద్భవిస్తున్నాయి. మానవునికి అరిషడ్వర్గములు చాలా ప్రధానమైనవి. ఈ అరిషడ్వర్గముల ద్వారా ఆవిర్భవించేవన్నీ నెగిటివ్వే. ఈ నెగిటివ్స్‌ను దూరం గావించి పాజిటివ్‌ను ప్రవేశింపచేసుకోవాలంటే ప్రేమతత్త్వము ఒక్కటే మూలాధారము. మానవుని హృదయమును ప్రేమతో నింపినప్పుడే సర్వము పాజిటివ్ ఆలోచనలే మన నుండి ఆవిర్భవిస్తుంటాయి. ప్రేమ నుంచి వచ్చినవే యీ సత్యతత్త్వములు. ఈ ప్రేమ నుంచి ఆవిర్భవించినవే సచ్చిదానందములు. ప్రేమనుంచి ఆవిర్భవించినదే కరుణారసము. ఈ ప్రేమ నుండి ఆవిర్భవించినదే దయారసము. ఈ పవిత్రమైన విలువ కలిగిన మానసిక విలువలు, మానవ విలువలు అన్నీ ప్రేమద్వారానే ఆవిర్భవిస్తున్నాయి. మానవతా విలువలంటే ఏమిటి? ప్రేమ నుండి ఆవిర్భవించేవే మానవతా విలువలు. హృదయమును ప్రేమతత్త్వముతో నింపుకోవాలి. హృదయము ప్రేమమయమై నప్పుడే మనము చేసే సర్వపనులు ప్రేమమయంగానే ఉంటాయి. అట్లుగాక హృదయమును క్రూరభావములతో నింపుకున్నప్పుడు ఎన్ని పూజలు చేసినా వ్యర్థములే అయిపోతుంటాయి. నీవు ప్రేమమయమైన జీవితాన్ని గడపినప్పుడు ఏ సాధనలు చేయనక్కరలేదు. ఈ జపముల, ధ్యానములు, తపములు కేవలం దేహముతో ఆచరించే నెగిటివ్ పనులే. అయితే యీ నెగిటివ్ భావము మానవునియందుండి నంతవరకు వీటిని మనం ఆచరించక తప్పదు. దేహాభిమానమే దీనికి మూలకారణము. దేహాభిమానం చెదరగొట్టుకోటం అంత సులభమైన పని కాదు. అనగా ఏమిటి? ఈ దేహమునకు మూలాధారమైన ఆత్మతత్త్వము ఒకటి ఉన్నది. ఆత్మతత్త్వము దేహమునకు పునాదివంటిది. కేవలం భవనమును చూచి మనం ఆనందిస్తుంటే ప్రయోజనం లేదు. దీనికి ఆధార భూతమైన ఆత్మతత్త్వము ఒకటి ఉన్నది. ఆత్మతత్త్వము దేహమునకు పునాది వంటిది. పునాది బలమును బట్టి భవనము యొక్క భద్రత ఉంటుంది. కనుక పునాది భద్రత చక్కగా మనము గుర్తించాలి. ఈ మానసిక

sri sathyasai vahamrutam

తత్త్వములన్నింటికి ఆత్మ అను పునాది మూలాధారము. ఆత్మభావముచేతనే మనం జీవితమును గడుపుతూ రావాలి. ఆత్మాభిమానంతో సలిపే ప్రతి పని కేవలం పాజిటివ్‌గానే రూపొందుతాయి. అనేకజన్మలనుండి ఈ భౌతికమైన వాంఛలు తనయందు యిముడ్చుకోటం చేత అన్నీ భౌతికమైన భావములే తనయందు ఆవిర్భవిస్తున్నాయి. కానీ సాధకుడు దినదినమునకు యీ భౌతికమును కొంతవరకు చల్లార్చి, అభౌతికమైన ఆత్మతత్త్వమును మనం లక్ష్యము నందుంచుకోవాలి. ఈ సత్ చిత్ ఆనందము మనకు ఏవిధంగా లభ్యమవుతుంది? ఒక కీటకమును తెచ్చి చిన్న గూడుగా పెట్టి అందులో దాన్ని చేర్చి భ్రమరము శబ్దముగావిస్తూ రావటంచేత కీటకము కూడా భ్రమరముగా మారిపోతుంది. అదేవిధముగా మనయందు సత్ చిత్ ఆనందము ఉన్నదో లేదో అని సందేహించక, నేను సత్ చిత్ ఆనంద స్వరూపుడను అని భ్రమరమువలె నిరంతరము స్మరిస్తూ ఉంటే తప్పక ఆ సచ్చిదానంద స్వరూపకముగా రూపొందుతావు. నేను సచ్చిదానందస్వరూపుడను అని నిరంతరం నీవు ఉచ్ఛరిస్తూ ఉండాలి. అదియే నీవుగా విశ్వసించాలి. యిది ఉచ్ఛ్వాస నిశ్వాసముల ద్వారా నిరంతరము పలుకుతూనే ఉన్నాము. సో..హం. సో...హం. సో ఆ దైవం నేనే. దానిని నేనే అనే తత్త్వము మనం నిరంతరం ఉచ్చరించాలి. అనగా ఏమిటి? నేనే ఆ సచ్చిదానందస్వరూపుడును. అప్పుడు యీ భౌతికమైన దేహాభిమానము క్రమక్రమేణా చల్లారుతుంది. ఇది క్రమక్రమేణా మరుగుపడిపోతుంది. నిత్య సత్యమైన ఆ సచ్చిదానంద స్వరూపమే ఆవిర్భవిస్తుంది. కానీ యీనాటి మానవుడు అట్టి నిత్యసత్యమైన సచ్చిదానందతత్త్వాన్ని గుర్తించుకొనలేక అసత్యమైన, అస్థిరమైన అప్రమాణమైన విషయములకే గురౌతున్నాడు. ప్రపధములో నీకు అది కష్టముగా తోచినప్పటికిని, కష్టమని భావించుకోకుండా “నేనే భగవంతుడను నేనే భగవంతుడను” అనే సత్యాన్ని నిరంతరము స్మరిస్తూ రావాలి. ప్రతి కార్యమునకు ప్రారంభములో కష్టములే కలుగుతూ ఉంటాయి. The pleasure is an interval between two pains. రెండు బాధల మధ్యలోనే ఒక సుఖము మనకు లభ్యమవుతుంది. కనుక మనం బాధలకేమాత్రం కృంగిపోకూడదు. నీవు నిజంగా ఆనంద స్వరూపుడవే. మానవుని యందు ఐదు కోశములుంటున్నాయి. అన్నమయకోశము దేహము. చాలా స్థూలమైనది.

sri sathyasai vachanamrutam

రెండవది ప్రాణమయము, దానికంటే సూక్ష్మమైనది. మనోమయము. యిది మరింత సూక్ష్మమైనది. మనోమయము నుండి విజ్ఞానమయమునకు ప్రవేశించాలి. ఈ విజ్ఞానమయం దాటిన తరువాతనే ఆనందమయం ప్రాప్తిస్తుంది. ఆనందమయకోశం చేరాలంటే మొట్టమొదట అన్నమయకోశమును ప్రాణమయకోశంలో చేర్చాలి. ఈ ప్రాణమయకోశాన్ని తిరిగి మనోమయకోశములో ప్రవేశపెట్టాలి. మనోమయ కోశము ఆవిర్భవిస్తుంది. ఏవిధంగా? అన్నమయకోశము యీ దేహము. ఇది క్రమక్రమేణా నశించేదే. దీని నిమిత్తమై ప్రాకులాడకూడదు. ఉండినంతవరకు దాని ఆరోగ్యాన్ని చూసుకోవలసిందే. దాని కర్తవ్య కర్మలు ఆచరించవలసిందే. అయితే మన లక్ష్యము ప్రాణమయంలో తీసుకోవాలి. ఈ దేహమును కదలించేది మెదలించేది ఏమిటి? అదే vibration అనే ప్రాణము. ఆ vibration అనే ప్రాణమే యీ దేహమును అనేక విధములుగా చలింపచేస్తున్నాది. కేవలం vibration ఉంటున్నాది గానీ ఏది సత్యము, ఏది నిత్యము అని విచారించే తెలివిలేదు ప్రాణమునకు. విచారణకు మనోమయకోశము అనే రేడియేషన్ లో మనం ప్రవేశించాలి. తదనంతరం విజ్ఞానమయకోశము, అదే విచారణ శక్తి లో మనం ప్రవేశించాలి. అదే constant integrated awareness. దానిని పొందిన తరువాత ఆనందమే మన ఆస్తి. ఆనందమునకు ఏమాత్రము మనం ప్రాకులాడనక్కరలేదు. తానే ఆనంద స్వరూపుడుగా మారిపోతాడు. మానవత్వము దివ్యత్వము పొందే నిమిత్తమై ఏర్పడినదే గానీ కేవలం భౌతికమైన లౌకికమైన ప్రాకృతమైన సుఖ సంతోషాలు అనుభవించే నిమిత్తము కాదు. పశుపక్షి మృగాదులతో పాటు క్రిమికీటకాదులు కూడా మానవుడు ఆచరించే కర్మలే ఆచరిస్తున్నాయి. మానవుడు కన్నులతో చూస్తున్నాడు. పశుపక్షి మృగాదులు, క్రిమికీటకాదులు కన్నులతో చూస్తున్నాయి. మానవుడు చెవులతో వింటున్నాడు. ఆ క్రిమికీటకాదులు చెవులతో వింటున్నాయి. మానవుడు ముక్కుతో వాసన చూస్తున్నాడు. అవి కూడా వాసన చూస్తున్నాయి. అవి కాళ్లతోనే నడుస్తున్నాయి. చేతులతో పని చేస్తున్నాయి. శబ్ద స్పర్శ రూప రస గంధాదులు యీ ఐదు పశుపక్షి మృగాదులకు కూడా ఉంటున్నాయి. ఇంక మానవుడు పశుపక్షి మృగాదుల కంటే ఏమి గొప్పవాడు. అవి కంట్రోలు లేకుండా సంచరిస్తున్నాయి. నీవు కంట్రోలు లేకుండా సంచరిస్తున్నావు.

sri sathyasai vachanamrutam

'జంతూనాం నరజన్మ దుర్లభం' అంటున్నారు. ఎక్కడ దుర్లభం? అవి చేసేవే మీరు చేస్తున్నారు, మీరు చేసేవే పశుపక్షి మృగాదులు చేస్తున్నాయి. అది కాదు దుర్లభం. చేసే పనులను, మాట్లాడే మాటలను, ఆలోచనలను మానవుడు స్వాధీనంలో ఉంచుకొని పశుపక్షి మృగాదులకు అతీతమైన స్థాయికి వెళ్లాలి. ఆవిధమైన మార్గము వెతకటానికి మొట్టమొదట నిజతత్వము గుర్తించుకోవాలి. మూడు రకములైన అద్వైతములను మనం పొందాలి. ఇవి ఏమిటి. కర్మాద్వైతము. ఏమిటి కర్మాద్వైతము. నేను ఉన్నాను. మీరు ఉన్నారు. మీ అందరిలోపల ఐదు పంచ ప్రాణములుంటున్నాయి. ఈ దేహమునందు పంచ ప్రాణములుంటున్నాయి. స్త్రీలయందు పంచప్రాణములుంటున్నాయి. పురుషులయందు పంచ ప్రాణములు ఉంటున్నాయి. బాలురయందు పంచప్రాణములుంటున్నాయి. అందరియందు రూపనామములు వేరు వేరైనప్పటికిని పంచప్రాణములందరి యందు ఒక్కటే. కనుక అందరియందు సమానంగా ఉండే అద్వైతము ఏమిటి? పంచప్రాణములే సమానత్వము. ఇంక వస్తు అద్వైతము. ఇది ఒక వస్తువు. ఇది ఒక వస్త్రము. ఇది వస్త్రము కాదు. దారముల చేరిక. దారములు కాదు, యిది పత్తి. పత్తి – దారము – వస్త్రము మూడు చేరి ఒక్కటే. అదేరీతిగా వస్తు అద్వైతము యీ రీతిగా ఉంటుంది. మనస్సు యొక్క అద్వైతము. కోటీశ్వరుడు గొప్ప విలువైన తిండి తింటాడు. ఒక భిక్షగాడు గంజినీరు త్రాగుతుంటాడు. అన్నములవి వేరు, ఆకలి ఒక్కటే. శ్రీమంతుడు మంచి హంసతూలికా పాన్పుపై పవళిస్తూ ఉంటాడు. పేదవాడు గట్టిరాతిపై పడుకొని నిద్రిస్తుంటాడు. ఇరువురికి నిద్ర వస్తుంది. దేహమునకు మాత్రమే సదుపాయములుగానీ నిద్రకు యిద్దరు ఒక్కటే. కనుక మానవత్వమును మనం చక్కగా విచారణ చేసుకున్నప్పుడు అద్వైత సిద్ధాంతము అందరియందు ఏకత్వంగానే ఉంటున్నది. ప్రతి మానవుడు తాను పుట్టినది తన తత్వము గుర్తించుకొనే నిమిత్తమే. తానెవరు? తాను దేహమా లేక మనస్సా లేక బుద్ధియా లేక చిత్తమా లేక అంతఃకరణా ఈవిధంగా విచారణ చేసుకుంటే ఆ దేహమే తానుగా భావిస్తున్నాడు. నొప్పి కలిగినప్పుడు నాచేయి నొప్పిగా ఉంది అంటావు. My hand అన్నప్పుడు hand వేరు, నీవువేరు. ఆ hand నీవు ఎట్లా అవుతావు. నా కర్చీఫ్ అంటే నేను వేరు, కర్చీఫ్ వేరు. My body అంటే my వేరు, body వేరు. My mind అంటే మైండు వేరు, నీవు వేరు. But who

srisathyasaivachanamrutam

are you నీవెవరు? ఈ విచారణ చేస్తూ పోయినప్పుడు మనస్సు, బుద్ధి అంతఃకరణ అన్నీ నీ కంటే వేరు. ఇవన్నీ నీవి. నీవు **master**. యివన్నీ instruments. Master the mind – be a master mind. నీవు master అనుకున్నప్పుడు నీవు master mind గా ఉండాలి. అప్పుడే ఏకత్వమనేది, దివ్యత్వమనేది నీకు అర్థమవుతుంది. నేను master అని అనుకుంటున్నావు పేరుకు మాత్రమే. Master mind లేదు నీలో. నీవు master mind గా ఉండాలి. అది నిజమైన సాధన. ఈవిధంగా ప్రతి భారతీయ పర్వదినములు, మన VC చెప్పినట్లు, మానవుని దైవత్వానికి చేర్చే మార్గములే. దైవత్వమును చింతించే పర్వదినములే. కానీ యీనాడు దైవత్వమును మననంచేయటం మానివేసి తిండి తీర్థాదులతో పర్వదినములు అనుభవిస్తున్నారు. ఈనాడు పర్వదినమంటే పాయసం పరమాన్నం చేసుకొని తినటం. అది కాదు పర్వదినమంటే. దివ్యత్వాన్ని చింతించి, ఆ దివ్యత్వములో ప్రవేశించి, దైవత్వమును పొందేదే పర్వదినము. శివరాత్రి. రాత్రి అనగా చీకటి. శివరాత్రి అనగా చీకటిలోపల మంగళకరమైనది. ఈ ఒక్కరాత్రి అయినా శివనామము చేత జాగరణ చేయి. సంవత్సరమునకు ఒక్క దినమైనా భగవంతుని నామము 24 గంటలసేపు ఉచ్చరించు. కానీ పర్వదినము మేలుకోవాలి అని అనుకుంటున్నారు. రాత్రంతా ఏవిధంగా మేలుకోవాలి? దైవచింతన చేస్తూ మేలుకోవాలి. అంతే గానీ 3 సినిమాలకు పోవటం, నాలుగు గంటలు T.V. లు పెట్టుకొని చూడటం యిది జాగరణ కాదు. "పేకాటనాడుచు ప్రీతితో నారాత్రి గడిపినందులకే జాగారమగునా" Cards ఆడుతూ రాత్రంతా మేలుకుంటే అది జాగరణ అవుతుందా. ఇది జాగరణ కాదు. మానవునికి 16 కళలుంటున్నాయి. ఈ 16 కళలలో 15 కళలు లయమైపోయి ఒక్క కళ మాత్రమే ఉంటుంది ఈనాడు. ఈ శివరాత్రి దినము ఏవిధంగానైనా సరే భగవన్నామముతో రాత్రంతా గడిపినప్పుడు ఆ ఒక కళ లీనమై పోతుంది. చాలా సులభమైన దినము యీనాడు. రాత్రంతా జాగరణ చేసి కాలము పవిత్రం గావించుకున్నప్పుడు జీవితమే పవిత్రమైపోతుందని దీని అంతరార్థము. శివరాత్రి. అన్ని రాత్రులకంటే ఈరాత్రి మంగళకరమైనది. దేనివల్ల? దైవచింతన చేత కాలమును సార్థకము చేసుకోవాలి. ఈ పర్వదినముల అంతరార్థము వేరైనప్పటికి మనం దృష్టికి తీసుకున్నప్పుడు చిన్న విషయము కూడా మనం విచారము చేయవచ్చు. రాత్రి అనగా

sri sathyasai vachanamrutam

sri sathyasai vachanamrutam

చీకటి. ఒకానొక రాజు అనేకమంది పండితులను ప్రశ్నించాడట. అన్నింటికంటే తెల్లని వస్తువు ఏమిటి అని. కొంతమంది చెప్పారుట పత్తి చాలా తెలుపు అని. కొంతమంది పాలు చాలా తెల్లగా ఉంటుందని చెప్పారుట. కొంగ తెల్లగా ఉంటుంది అన్నారుట. కానీ ఒక పండితుడు గుర్తించాడట. పగలు తెలుపు, రాత్రి నలుపు అన్నాడుట. ఇది సత్యమైనది. ఈ పగలే తెలుపు. అదే సాత్వికము. నలుపు అనేది రాత్రి. ఇది రజోతమో గుణముల యొక్క చేరిక. ఈ రజో తమో గుణములను సాత్వికముగా మార్చాలి. భగవద్గీతలో స్థితప్రజ్ఞ లక్షణము అన్నారు. స్థితప్రజ్ఞుడనగా అందరు మేలుకొన్నప్పుడు తాను నిద్రపోవటము, తాను మేలుకున్నప్పుడు అందరు నిద్రపోవటము అని చెబుతుంటారు.ఆ విధంగా భావించుకుంటే స్టేషను మాష్టర్లు రాత్రంతా మేలుకుంటారు. పగలంతా నిద్రపోతారు. ఘూర్కాలు రాత్రంతా మేలుకుంటారు. దైవాన్ని నిరంతరము తలచుకుంటూ మంచికి, చెడుకు చలింపక సమభావముతో గడిపేవాడే స్థితప్రజ్ఞుడు. ప్రతి దినము గడపటానికి వీలు కానప్పుడు, సంవత్సరమునకు శివరాత్రి లాంటి ఒక్క దినమైనా రాత్రి పవిత్రమైన నామచింతన చేత కాలమును సార్థకము చేసుకోవాలి. ముఖ్యముగా మనం యీనాడు గుర్తించవలసినది మన హృదయంలో నెగిటివ్ thoughts అంతా దూరం చేసుకోవాలి. ఈ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు అరిషడ్వర్గములంతా హృదయము నిండి ఉన్నాయి. తద్వారా అనేక క్రోధములు, ద్వేషములు, అసూయలు యిలాంటివంతా లోపలి నుండి ఆవిర్భవిస్తున్నాయి. మానవునిలో కించిత్తైనా ప్రేమ, దయ అనేవి కనిపించటం లేదు. మన హృదయాన్ని ప్రేమతో నింపినప్పుడే సర్వవేళల అది ప్రేమమయంగానే ఉంటుంది. ఇవన్నీ ప్రేమమయమే. ఇదే పాజిటివ్. మానవుడు positive లక్షణాలు పెంచుకోవాలి గానీ నెగిటివ్ లక్షణాలు పెంచుకోకూడదు. నెగిటివ్ లక్షణాలు ఎంత పెంచుకుంటారో అంత జీవితము వ్యర్థమైపోతుంది. ఎప్పుడు దుశ్చింతలే దురాలోచనలే. దుష్కర్మలే చేస్తుంటాడు. ఎక్కడ వెతికినా positive కనిపించదు. జీవితమంతా negative mind గానే మారిపోతుంది. ఇది మానవ సహజ గుణము కాదు. మానవుడన్న తరువాత అతనిలో positive లక్షణాలు రావాలి. దయ, ప్రేమ, సహనము, సానుభూతి యిలాంటి గుణములు రావాలి. ఎప్పుడు చూచినా ఏవో కొన్ని కోరికలు, వాంఛలు. భౌతిక వాంఛల చేత జీవితము

వ్యర్థము గావిస్తున్నారు. వాంఛలన్నీ negative వాంఛలే. కానీ ఆ నెగెటివ్ వాంఛలకు బదులు దివ్యమైన వాంఛలు నీవు ఆశించు. ఇవి సహజంగానే నీకు ప్రాప్తిస్తుంటాయి. లౌకిక జగత్తునందు కూడా నీకు తగినవి ప్రాప్తిస్తూ ఉంటాయి. వాటిని నీవు ప్రత్యేకంగా కోరనక్కరలేదు, చేయనక్కరలేదు. దైవభావముతో నీవు చేస్తూరా. అదే నీకు ప్రాప్తిస్తుంది. కనుక భౌతికమైన వాటికోసం బ్రతుకుతున్నామని భావించరాదు. భౌతికమైనవి ఏనాడైనా అనుభవించవచ్చు. ఎన్ని జన్మలు ఎత్తినారో, ఎన్ని జన్మలు అనుభవించారో. ఈ జన్మలోనైనా పారమార్థికభావము అనుభవించాలని ఆశించాలి. మానవుని యందు యిలాంటి పవిత్రమైన శక్తి ఉందని వారు గుర్తించుకోలేకపోతున్నారు. యావత్ ప్రపంచమే మానవుని యందుంటున్నది. ఈ ప్రపంచములో ముఖ్య పదార్థము ఏమిటంటే మానవుడు. మానవునియందు ఎంతో విలువైన భావములు ఉంటున్నాయి. ఇలాంటి విలువైన మానవత్వాన్ని ఎందుకు వ్యర్థం చేసుకుంటున్నారు. మానవుని చూపు చాలా ప్రధానమైనది. మానవుని మాట చాలా మధురమైనది. మానవుని పనులు కూడా చాలా సార్థకమైనవి. అలాంటి సార్థకమైనవి ఉండి కూడను ఎందుకు వ్యర్థము చేసుకుంటున్నారు. మంచి చేసేది చేతులే, చెడ్డ చేసేది చేతులే. కాబట్టి చెడ్డ చేసే బదులు మంచి చేసి ఆనందమును అనుభవించు. నీవు యీ పవిత్రమైన కర్మలలోపల ప్రవేశపెట్టాలి. Help ever hurt never. చెడ్డ కార్యములలో మనం ప్రవేశించకూడదు. Hurt చేయటమే negative. Help చేయటమే positive. పవిత్రమైన మాటలచేత హృదయాన్ని ఆనందపర్చటం positive. కఠినమైన మాటలచేత మరొక మనస్సును గాయం చేయటం negative. ఈ నెగెటివ్ అనునది ఎదుటివారిని బాధపెట్టేది.అలా చేస్తే ఆ బాధలు నీకు కూడా కలుగుతూ ఉంటాయి. ఒకరిని భాద పెట్టనక్కర లేదు. నీవు పడనక్కరలేదు. సుమతీ శతకములో చెబుతూ వచ్చాడు.

**నొప్పించక తానొవ్వక**
**తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ**

అన్నాడు. ఒకరిని నీవు నెప్పి పెడితివా అందుకు పదింతలు నీవు నొప్పి పడవలసి వస్తుంది. నొప్పించకు. నీవు నొప్పి పడకు. ఎప్పుడు? Positive thoughts వచ్చినప్పుడు యిద్దరికి ఆనందముగా ఉంటుంది. మానవుడు యీనాడు నెగెటివ్ thoughts క్రమక్రమేణా

sri sathyasai vahamrutam

తగ్గించుకుంటూ పోవాలి. దుర్వాంఛలు క్రమక్రమేణా తగ్గించుకోవాలి. Desires ను తగ్గించుకుంటే positive thoughts వస్తాయి. దేహాభిమానం పెంచుకోటం చేత మనలో యీ negative thoughts పెరిగి పోతున్నాయి. అది అప్పటికప్పుడు వానికి తెలియదు గానీ భవిష్యత్తులో దీని తత్వము అర్థమవుతుంది. ఆనాడు విచారించి ప్రయోజనం ఏమిటి? ముందుగానే జాగ్రత్తపడాలి. ఈవిధంగా జాగ్రత్త పడినప్పుడే జీవితాన్ని ఆనందపరచుకోవచ్చు. ప్రతి మానవుడు కూడ ఆనందమయుడు కావాలి. ఈ ఆనందము ప్రాకృతమైన ఆనందము కాదు. మనం ఆనందిస్తూనే ఉన్నాం. కాలం గడుపుతూనే ఉన్నాం. క్షణభంగురమైన ఆనందము ఏమాత్రము శాంతిని అందించదు. శాశ్వతమైన ఆనందమే మనకు శాంతిని చేకూరుస్తుంది.

**అస్థిరం జీవనం లోకే అస్థిరం యవ్వనం ధనం**
**అస్థిరం దారా పుత్రాది సత్యం కీర్తి ద్వయం స్థిరం**

ఆ సత్యమే నిజమైనది, శాశ్వతమైనది. ఆ సత్యమే బ్రహ్మము. అదే నిజమైన సచ్చిదానందము. ఆ సచ్చిదానందము ప్రత్యేకంగా నీకంటే దూరమైనది కాదు. ఎక్కడో ఉంటే వెతుక్కొని తెచ్చుకొనేది కాదు. నీవే సచ్చిదానందము, ఇంక సచ్చిదానందమును ఎక్కడ వెతుకుతావు. మానవుడు తనను తాను బయట వెతుక్కునేవాడున్నాడా? లేదు. తనను తాను తెలుసుకోటమే సచ్చిదానందము. ఇలాంటి పవిత్ర భావముల చేత జీవితాన్ని సార్థకము గావించుకుంటూ రావాలి.

**భగవంతుని ప్రేమ నిస్వార్థ ప్రేమ**

ప్రేమస్వరూపులారా! ప్రతి మానవుడు ప్రేమమయుడే. ఆ ప్రేమ మయుడైన మానవుడు ప్రేమనే పెంచుకోవాలి. ఈ ప్రేమ ఎంత పెంచుకుంటామో ఆనందము కూడా అంత పెరిగిపోతుంది. ఎంత ఆనందము నీవు అనుభవిస్తావో అంత హాయిని నీవు పొందుతావు. అదే శాంతి. అనవసరమైన నెగిటివ్ వాంఛలలో ప్రవేశించి అనేక రోగములకు, దుఃఖములకు, విచారములకు గురికానక్కరలేదు. మీరు ఎవరైనా ఏవిధంగా విచారించినా **ఒక్క విషయాన్ని మీరు చక్కగా గుర్తుంచుకోవాలి. నాలో యీనాటి వరకు 72**

sri sathyasai vachanamrutam

సం॥లు అయినప్పటికి నెగిటివ్ ఆలోచనలు ఎప్పుడూ రాలేదు. కనుకనే నాకు ఎట్టి విధములైన రోగములు లేవు. నేనెప్పుడు ఆనందముగానే ఉంటున్నాను. అయితే కొంతమందిని సరిచేసే నిమిత్తమై కొంత కఠిన పదములు ఉపయోగిస్తాను. అది negative పదములు కాదు. ప్రేమతో కూడిన పదములే అవికూడా. నా గుండె చూస్తే పెద్ద యినుప గుండువలే ఉంటున్నాది. కానీ వెన్నముద్ద వలె ప్రేమ కురిపిస్తూనే ఉంటున్నాది. ఆరోగ్యమునకు అడ్డు తగలదు. ఇంత పనులు నేను చేస్తుంటాను. తెల్లవారి లేచినది మొదలుకొని రాత్రి పరుండేంత వరకు ప్రజలను చూస్తున్నాను. వారిచ్చిన letters చూస్తున్నాను. అందరికి తగిన ఆనందమును వారి కందిస్తున్నాను. ఏ ఆఫీసరునైనా, ఏ అధికారికైనా ఒక్క sunday holiday ఉంటుంది. నాకు ఒక్క sunday కూడా holiday లేదు. నేను ఎప్పుడు పనిచేస్తూనే ఉంటాను. నేను యిక్కడుండినా, ఎక్కడకు పోయినా work చేస్తుంటాను. ఈవిధంగా రాత్రింబవలు 72 సం॥లు పనిచేస్తూన్న వారు ఎవరున్నారో చూపించండి. ఏనాడైనా నేను రెస్టు కావాలని ఆశించలేదు. నేను ఎప్పుడు rest గానే ఉన్నాను. కారణం ఏమిటి? negative లేకుండా ఉండటమే rest. ఈ దేహాభిమానం నాకు లేదు. దేహం మీకోసమే. దేహాభిమానం ఉండినప్పుడే తగిన rest కావాలి. నేను ఏమిచేసినా ఏమి పనిచేసినా, ఏవిధమైన కర్మలు ఆచరించినా మీ నిమిత్తమేగానీ నా నిమిత్తము కాదు. ఇలాంటి సత్యాన్ని గుర్తించి వర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యము. నేను ఎప్పుడు మిమ్మల్ని కోరేదీ అడిగేదీ ఒక్కటే. మీ హృదయాన్ని ప్రేమతో నింపుకోండి. అదొక్కటి మాత్రమే నాకందించండి. నేను ఎవరిని ఏదీ అడగటం లేదు. మీరు ప్రేమగా ఉండి మీ ప్రేమను పదిమందికి పంచి, మీరు ఆనందించి పదిమందిని ఆనందపెట్టండి. మీరు happy గా ఉండినప్పుడు మీరు పదిమందికి happiness అందిస్తారు. ఈ happiness ఎక్కడ నుండి వస్తుంది? Hapiness ఎక్కడ ఉంది అని విచారణ చేస్తే happiness is union with God అన్నారు. ఆ భగవంతుని నామముచేతనే నీకు happiness వస్తుంది. ఈవిధమైన సాధనల చేత జన్మ సార్థకం గావించుకోవాలి. జపము, ధ్యానము ప్రాపంచకంగా చేసుకోండి. అవన్నీ కాలమును సార్థకము గావించుకునే కర్మలే. కానీ నిజమైన శాంతి చిక్కే మార్గము అదికాదు. హృదయాన్ని పాజిటివ్‌గా మార్చుకోటమే శాంతి.

srisathyasaivachanamrutam

కానీ ప్రాపంచకంగా జపము చేయండి ధ్యానము చేయండి. భజనే చేయండి. ఇత్యాది సత్కర్మలు ఆచరించటంలో కర్మలు సార్ధకము చేసినవారౌతారు. కాలము కూడా చాలా ప్రధానమైనదే. కాలము పరమాత్మ స్వరూపము. ఆ టైమును కూడా మనం సార్ధకం చేయటానికి సత్కర్మలు అత్యవసరమే. కానీ ఈ కర్మనే మనం ఆచరిస్తూ కూర్చుంటే ప్రయోజనం లేదు. ఈ కర్మలన్నీ భౌతికమైనవి. దివ్యమైన హృదయముతో కూడిన కర్మలు ఆచరిస్తూ రావాలి. అప్పుడే మనకు ఏవిధమైన రోగములు లేకుండా ఉంటాయి. రోగములు ప్రారంభం కావటం చేత అశాంతి ప్రారంభమవుతుంది. తద్వారా ఆనందము కూడా తరుగుతుంది. నీవు healthy గా ఉండాలి, happy గా ఉండాలి. Healthy, happy రెండూ ఏవిధంగా వస్తాయి. నీవు పవిత్రమైన భావముతో నీ హృదయాన్ని నింపుకున్నప్పుడు healthy happy గా ఉంటావు. మన హృదయములో చెడ్డభావములు ఏమాత్రము ప్రవేశించకుండా చూచుకోవాలి. నాకు ఎవరిపైనా ఏవిధమైన ద్వేషము లేదు. కనుక నాపై ఎవరికి ద్వేషము లేదు. నాకు అందరు ప్రేమమయులే. అందరు ప్రేమ స్వరూపులే. అందరు క్షేమంగానే ఉండాలి. అందరు ఆనందమునే అనుభవించాలి. ఆ విశాలమైన భావం నాలో ఉండబట్టి నాదగ్గరకు యింతమంది వస్తున్నారు. ఆ విశాలభావం లేకుండా స్వార్ధముగానే ఉంటే ఈ దేశ దేశములవారు ఊరకే రారు. నాలో కాలి మొదలు తల వరకు నిస్వార్ధమే, నిస్వార్ధమే. No trace of selfishness. ఏదైనా selfish గా మీకు కనిపించినప్పటికి అది మీ నిమిత్తమే కానీ నా నిమిత్తమై కాదు. నాకు ఎట్టి వాంఛలు లేవు. నాకున్నది ఒకే వాంఛ. లోకస్సమస్తా సుఖినోభవంతు. అందరు సుఖంగా ఉండాలి. అందరు మంచి గుణవంతులుగా ఉండాలి. అందరు ప్రేమమయులు కావాలి. అందరు ఆనందమును అనుభవించాలి. ఇంతకంటే కావలసింది ఏమిటున్నాది. అయితే మానవుడు ఆనందమునకు అర్హుడే. శాంతికి అర్హుడే. కానీ ప్రేమ, విశ్వాసం తగినంత తీసుకోలేక పోతున్నాడు. కవరుపై ఎడ్రసు వ్రాసి, స్టాంపు లేకపోతే పోదు. స్టాంపు అంటించి, ఎడ్రసు వ్రాయకపోతే పోదు. కనుక ప్రేమ అనే స్టాంపు అంటించి విశ్వాసమనే అడ్రసు వ్రాసి post చేయి, ఎంతదూరమైనా వెళ్లిపోతుంది. ఆ విశ్వాసము, ప్రేమ రెండు లేని సమయంలో ఎంత పెద్ద కవరు వ్రాసినా అడుగు దూరమైనా పోలేదు. ఈ విశ్వాసము, ప్రేమ రెండు

sri sathyasai vahini

ఉంటే చాలు. స్వామిపై ప్రేమ, విశ్వాసం ముఖ్యము. మీరు ఏ పనిచేసేటప్పుడైనా యిది స్వామికి యిష్టమా కాదా అని గమనించాలి. భగవంతుని తృప్తి చేయటానికి ప్రయత్నించాలి. ముఖ్యముగా మూడు భావాలు చెప్పాను. దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి. దైవప్రీతి మీలో కావాలనుకుంటే ఏమి చేయాలి? ఏ పనిచేస్తున్నా యిది దైవమునకు ప్రీతా కాదా! దీనికి సంతోషిస్తాడా లేదా అని తలచుకొని నీవు ఆ పనిచేస్తే తప్పక భగవంతునికి ప్రీతి అవుతుంది. ఆ భగవత్ప్రీతి మీలో అభివృద్ధి అయ్యేకొలది మీలో ఎంతో పాపభీతి పుడుతుంది, సంభవిస్తుంది. పాపం చేయటానికి ఏమాత్రం అడుగు వేయవు. ఎందుకంటే ప్రేమతో నిండి ఉంది నీ హృదయము. కనుక పాపభీతి తప్పక సంభవిస్తుంది. ఈ రెండింటి ఏకత్వము చేత సంఘనీతి, సంఘములో గౌరవము వస్తుంది. సంఘము చేత గౌరవము అందుకోగలవు. ఇది నీకు సరైన మార్గము. మొట్టమొదట దైవప్రీతిని పెంచుకోవాలి. దైవప్రీతి పెంచుకుంటే పాపభీతి సహజంగా లభ్యమవుతుంది. ఈనాడు లోకములో యిన్ని కష్టములకు దుఃఖము లకు బాధలకు కారణము ఏమిటి?

**పాపభీతి లేని పామరత్వము బట్టి**
**దైవప్రీతి లేని దాని పట్టి**
**మానవత్వమణగె మానవులందున**
**విశ్వశాంతికిదియె విప్లవంబు.**

ఈనాడు శాంతికంతా విప్లవము రావటానికి యిదే మూలకారణము. కనుక పాపభీతి, దైవప్రీతి రెండింటిని మానవుడు పెంచుకోవాలి. సంఘములో నీకు కావలసినంత గౌరవము లభ్యమవుతుంది. రెండు లేక సంఘము గౌరవించాలంటే ఏ సంఘము గౌరవించదు. నీవు మంచివాడుగా ఉంటే పశువులు కూడా గౌరవిస్తాయి. కృష్ణుడు వేణుగానము చేస్తుంటే పశువులు మేతను మాని ఆ గానాన్ని ఆనందంగా వింటుండేవట. ఆ గానములో అంత మాధుర్యముంటున్నాది. కేవలం వేణువు ఊదటంచేత గానం కాదు. ఏవిధంగా వచ్చింది ఆ గానము. గోపబాలుర ఆనందము, పశువుల ఆనందము పంచుకుంటూ వచ్చింది ఈ వేణుగానము.

sri sathyasai vahini vachanamrutam

**పాటపాడుమా కృష్ణా పలుకు తేనెలొలుకునటుల**
**మాటలాడుమా ముకుంద మనసుతీరగా**
**వేదసారమంత తీసి నాదరూపముగను మార్చి**
**వేణువందు తిరగబోసి గానరూపముగను మార్చి**
**పాటపాడుమా కృష్ణా పలుకు తేనెలొలుకునటుల**

ఈ వేణుగానములోపల ఆ గోవు పాలనంతా పితికి అటూ ఇటూ తిరుగాడటం చేత యిదే గానరూపంగా మారిపోయింది. కనుక భగవన్నామము మన హృదయము నుండి ఆవిర్భవించినప్పుడు యిదే వేణునాదంగా మారిపోతుంది. ఈ హృదయము నుండి ఆవిర్భవించిన నాదము ఎంతో గొప్పగా ఉంటుంది. సుస్వరంగా ఉంటుంది. అట్టి పవిత్ర ప్రేమతత్వాన్ని మనము ఈనాడు పెంచుకోవాలి. ఈ ప్రేమచేతనే మన జీవితము సార్ధకము గావించుకోవాలి. మిగిలిన ఏమార్గము నీకు అక్కరలేదు. ప్రేమ ప్రేమ ప్రేమ. అందరిని ప్రేమించాలి. My life is my message. నేను అందరిని ప్రేమిస్తాను. తప్పుచేసినవారిని కూడా ప్రేమిస్తాను. నాపై ద్వేషముగా ఉన్నవానిని కూడా నేను ప్రేమిస్తాను. ఎవరిపైనా నాకు ద్వేషము లేదు. విశ్వాసమే ఈ ప్రేమకు మూలకారణం. ఎవరిని నేను ద్వేషించను. కనుకనే ప్రపంచమంతా నన్ను ప్రేమిస్తుంది. ఈ ప్రేమకు మూలకారణం విశ్వాసమే. ఆ విశ్వాసమునకు మూలకారణం దివ్యమైన సత్యమార్గమే. ఈ సత్యమార్గమునకు మూలకారణము దివ్యత్వమే. ఈ దివ్యత్వము ఈ సత్యమార్గములో ప్రవేశించి విశ్వాసముచేత ప్రపంచమును ఏకముగా భావిస్తున్నాది. అందరు సోదరత్వాన్ని పెంచుకోవాలి. అప్పుడే మానవత్వములో దివ్యత్వము ప్రారంభమవుతుంది. అప్పుడే మానవత్వము ప్రకాశిస్తుంది. అందరికి ఆదర్శవంతమైన మానవుడుగా తయారౌతావు. మానవుడుగా పుట్టినావు. పుట్టి మనం చేసే పని ఏమిటి? ఆదర్శప్రాయుడుగా నీవు ఉండు. నీవు ideal man గా తయారుకావాలి.

ప్రేమస్వరూపులారా! నా యొక్క ప్రేమతత్వాన్ని అందరు అర్థం చేసుకోలేరు. ఆ ప్రేమయే నిజమైన పాజిటివ్. ఆ ప్రేమను మీరు కూడా పెంచుకోండి. తప్పక మీరు పాజిటివ్ అవుతారు. కనుక నేను అప్పుడప్పుడు దివ్యాత్మస్వరూపులారా అంటాను.

srisathyasaivachanamrutam

మీరందరు దివ్యాత్మస్వరూపులే. ఎప్పుడు ఈ ప్రేమ తత్వాన్ని మీలో పెట్టుకున్నప్పుడు దివ్యాత్మస్వరూపులౌతారు. దివ్యాత్మ స్వరూపులు కావటానికి దివ్యప్రేమ పెంచుకోవాలి. ఆ దివ్యప్రేమ లేక దివ్యాత్మ స్వరూపులారా అంటే అర్హత లేదు. ప్రతి మానవుడు అంతో యింతో తనలో ప్రేమను పెంచుకోవాలి. దైవాన్ని ప్రేమించండి. ప్రపంచములో ప్రేమించ దగినది ఒక్కటే ఒక్కటి. అదే దైవము. తల్లితండ్రిని లోకరీతిగా ప్రేమించ వలసిన వారు. వారు కూడా నెగిటివ్‌కి సంబంధించిన వారే. ఎందుకంటే అశాశ్వతమే. శాశ్వతమైనతత్వము దైవత్వము ఒక్కటే. ఆ దైవత్వమును మీరు ప్రేమించి దివ్యత్వము పెంచుకొని పవిత్రతను మీరు సార్ధకము చేసుకోండి. యిదే నిజమైన శివరాత్రి ప్రధానమైన సారము. మనం పుట్టినందుకు ఒక సార్ధకమైన పేరు సంపాదించాలి. దైవత్వమును మనం తప్పక అభివృద్ధిపరచుకోవాలి. మనలో దాగి ఉన్న దైవత్వమును వెలువరించాలి. మనలో ఉన్న దైవత్వమునే ఆవిర్భవింప చేసుకోవాలి. ఈవిధమైన సాధనలు మనం చేయాలి. ఎక్కడికో మనం పోనక్కర లేదు. పుట్టదగ్గరకు పోయి వేణుగానము ఊదితే తప్పక పుట్టనుండి పాము బయటకు వస్తుంది. అదేరీతిగా మనయందున్న దైవత్వము దివ్యాత్మగా మార్చు కున్నప్పుడు అదే దైవత్వంగా రూపొందుతుంది. నిరంతరం దైవనామాన్ని స్మరించండి. గట్టిగానైనా సరే, మెత్తగానైనా సరే, హృదయంతోనైనా సరే దైవత్వాన్ని స్మరించండి. ఏ పనిచేసినా ప్రేమతో చేయండి. అప్పుడు విజయం సాధిస్తారు. ప్రేమలేకుండా విసుగుతోనో ద్వేషముతోనో ఏమంచి కార్యము చేపట్టినా అది విఫలమే అయిపోతుంది. కనుక నీకు విజయం కావాలనుకుంటే ప్రేమతో కార్యంలో ప్రవేశించాలి. ఎవరిని ఏవిధంగా ద్వేషించకూడదు. కారణం ఏమిటి అందరియందు భగవంతుడే ఉన్నాడు. అందరియందు దైవత్వమే ఉంటున్నాది. విదేశీయులు అంతమంది దేవుళ్లున్నారా భారతీయులకు అంటారు. కాదు కాదు ఉన్నది ఒక్క దేవుడే. అనేక పేర్లుతో అనుభవిస్తున్నారు. విలువైన వజ్రమునకు అనేక ముఖములు ఉంటున్నాయి. అనేక ముఖముల చేత అనేక కాంతులతో ప్రకాశిస్తుంది. అనేక కాంతులతో ప్రకాశించటం చేత అనేక డైమండ్సు కాదు, ఒకే డైమండు. అదేరీతిగా దైవత్వమనే దివ్యత్వము అనేక కాంతులతో ప్రకాశిస్తుంది. డైమండ్ అనేది God. ఆ డైమండు సంపాయించుకుంటే die mind మనోనాశనమై పోతుంది. అప్పుడు పాజిటివ్‌గా

sri sathyasai vachanamrutam

రూపొందుతారు. క్రమక్రమేణా వాంఛలు తగ్గించుకొని పవిత్రమైన సేవలలో ప్రవేశించి సమాజములో సేవలు చేస్తూ రావాలి. ప్రతి మానవుని గౌరవిస్తూ పోవాలి. అప్పుడే నీలో దివ్యత్వము ఆవిర్భవిస్తుంది. ఆ దివ్యత్వము నీవు పొందుటకు తగిన రాజబాట యిదే. ఈ సాధనలు, ఆ సాదనలు పిచ్చి పిచ్చి సాధనలు. ఇవన్నీ తాత్కాలిక తృప్తినందించేవే. కానీ శాశ్వతానందము నందించేది ఒక్కటే, అదే ప్రేమ మార్గము. ఆ ప్రేమ మార్గము జగత్తునంతా ప్రేమమయంగా మారుస్తుంది. ఆ ప్రేమయే భగవత్ స్వరూపము. ఆ సత్యమే భగవత్స్వరూపుడు. ఆ శాంతమే భగవత్స్వరూపుడు. అదే సత్ చిత్ ఆనందము. సచ్చిదానందము నిమిత్తమై మనము ఎక్కడికోపోయి ప్రయత్నం చేయనక్కరలేదు. మన స్వరూపమే సచ్చిదానందం. దేహమే దేవుడు. ఆత్మయే దేవుడు. జీవ, దేహ రెండింటి ఏకత్వమే సచ్చిదానందము. సచ్చిదానందము దేహముతోనో ఆత్మతోనో కూడినది. దేహము లేక ఆత్మ మనకు తెలియదు. ఆత్మ లేక దేహమే ఉండదు. రెండింటి ఏకత్వము చేత దేహాత్మ స్వరూపంగా ఉంది. ఈవిధమైన మార్గము అనుభవించి దివ్యమైన సేవలు యితరులకు చేసి దైవత్వమును మీరు అనుభవించుటకు తగిన కృషిచేయాలి. యిదే శివరాత్రి యొక్క అంతరార్థముగా భావించుకోవాలి. ఈనాటి ఒక్కరాత్రి దైవనామం చింతించుకుంటూ గడపండి. యిదే నిజమైన సార్థకత అవుతుంది. సంవత్సరమునకు ఒక్కరాత్రి. ఎన్ని రాత్రులలో మీరు అపవిత్రం చేస్తున్నారు. అది కాదు. ఇదే నిజమైన సార్థకమైన రాత్రి. యిదే శివరాత్రి. మిగిలినవి శవరాత్రులు, అట్టిది మీరు అనుభవించ కూడదు. శివరాత్రి అనుభవించాలి.

**(తేదీ 25-02-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam